సాక్షి

# సాహిత్య దీపస్తంభం విశ్వనాథ

## ఘనంగా విశ్వనాథ సాహిత్య పీఠం ద్విదశాబ్ది ఉత్సవాలు



పూర్ణత్వపు పొలిమేరలో.. పుస్తకం ఆవిష్కరించిన మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

సనత్‌నగర్: విశ్వనాథ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో నిర్వహించిన ద్విదశాబ్ది ఉత్సవాల్లో సాహిత్య సౌరభాలు వెల్లివిరిశాయి. ఆదివారం జరిగిన ఈ వేడుకల్లో విశ్వనాథుల సాహితీ వైభవాన్ని పలువురు సాహితీవేత్తలు కొనియాడారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆవుల మంజులత మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణ తెలుగు సాహిత్యానికి దీప స్తంభం లాంటివారని పేర్కొన్నారు. ఆయన దృక్పథంతో తాము విభేదిస్తున్నప్పటికీ, ఆయన మహాకవి అనడంలో సందేహంలేదని ప్రముఖకవి నిఖిలేశ్వర్ అన్నారు. మధ్యాహ్నం 'విశ్వనాథ రచనల్లో హాస్యం'పై సదస్సు నిర్వహించగా, ఇందులో ఆచార్య మృణాళిని, ఏపీ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రమణ్యం హాజరై 'విశ్వనాథ వారి ముద్దు వడ్డన్లు'పుస్తకాన్ని ఆవిష్కరించారు. విశ్వనాథ రచనల్లో హాస్యం గురించి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు, దూరదర్శన్ పూర్వ క్రియేటివ్ డైరెక్టర్ ఓలేటి పార్వతీశం, తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు ఆచార్య కె.యాదగిరి కొనియాడారు. కార్యక్రమంలో వెల్చాల కొండల్‌రావు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### 'సిరివెన్నెల'అమృతాన్ని కురిపించాడు: ఎన్వీఎస్‌రెడ్డి

సాయంకాలం నిర్వహించిన 'సిరివెన్నెల సీతారామశాస్త్రి పాటలు'సాంస్కృతిక కార్యక్రమంలో సిరివెన్నెల సోదరుడు చేంబోలు శ్రీరామశాస్త్రి రచించిన 'పూర్ణత్వపు పొలిమేరలో..' పుస్తకాన్ని మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శ్రీరామశాస్త్రి తన పుస్తకం ద్వారా సిరివెన్నెల స్ఫూర్తివంతమైన జీవితాన్ని సమాజానికి మరింత లోతుగా పరిచయం చేయడం గొప్ప విషయమన్నారు. కోవిడ్ కాలంలో తాను హైదరాబాద్ మెట్రో చరిత్రనంతా 58 కవితలుగా మాత్రాచ్ఛందస్సులో 'మేఘపథం'అనే కావ్యంగా రాసినప్పుడు శాస్త్రి దానికి ముందు మాట రాస్తానన్నారని గుర్తు చేసుకున్నారు. ఆయన అమృతాన్ని కురిపించిన అమరుడని అన్నారు. అనంతరం చేవూరి సుబ్బారావు 'సమ్మాన్యుడు (సంక్షిప్తం) పుస్తకాన్ని ఆవిష్కరించారు.